జగనే పదికాలాలు సీఎంగా ఉండాలి

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఎదుట తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన నాగిరెడ్డిపల్లెవాసులు



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు జనం నీరాజనాలు పడుతున్నారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీ అయిన నాగిరెడ్డిపల్లెలో మంగళవారం ఎమ్మెల్యే జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. నాగిరెడ్డిపల్లెవాసుల నోట ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదికాలాల పాటు ఉండాలని మహిళలు, వృద్ధులు, బీసీ, మైనార్టీలకు చెందిన వారు అభిప్రాయాన్ని ఎమ్మెల్యేకు వ్యక్తం చేశారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ పునగాని వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ జంబు సూర్యనారాయణ నేతృత్వంలో గొల్లపల్లె, తురకపల్లె, అరవపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి ప్రతి ఇంటికి వెళ్లారు. వీరి వెంట జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, పునగాని గుణయాదవ్, సంపతిహరి బాబు, వేణుగోపాల్, రామయ్య, మైనార్టీ ఖాజా హుసేన్, బడే, జిలానీ, జానీబాషా, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్‌అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల సౌమిత్రి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగెమణి, నడివీధి సుధాకర్, ఆర్ముగం విశ్వనాథ, పులి భాస్కరయ్య, అరిగెల నాని, కాకి చంద్ర, నాగసుబ్బయ్య, మార్కెట్‌కమిటీ డైరక్టరు మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార దిశగా ఎమ్మెల్యే అడుగులు

నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లె, అరవపల్లె, తురకపల్లె తదితర ప్రాంతాల్లో ప్రజలు తెలియజేసుకున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అడుగులు వేశారు. ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు ఉదయ శంకర్‌రాజు, ఈఓఆర్డీ ప్రసాద్, సచివాలయ వలంటీర్లతో మాట్లాడుతూ అక్కడక్కడే సమస్యలను పరిష్కరించేలా ఎమ్మెల్యే ఆదేశించారు. ముస్లిం మహిళలు చాలా మంది నల్లతిమ్మాయపల్లెలో తమకు ఇంటిస్థలాలు వద్దని, అనుకూలమైన ప్రదేశంలో ఇవ్వాలని ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. ఇందుకు ఆయన ఈదరపల్లెలో స్థలం ఎంపిక చేశామని, అక్కడ ఇస్తామని భరోసా ఇచ్చారు. అలాగే స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. విద్యాపరంగా అవసమైన మౌళికసదుపాయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

బీసీ నేతల సన్మానం

గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, ఎంపీపీలను గొల్లపల్లెలో బీసీ నేతలు ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, నాగిరెడ్డిపల్లె ఉపసర్పంచ్ గోపినేని పుష్పలత, బీసీ నాయకుడు గోపినేని హిమగిరియాదవ్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఘనంగా స్వాగతం పలికారు.

ఈఎస్ఐ హెల్త్ కార్డులతో కార్పొరేట్ వైద్యం



కార్మికులకు ఈఎస్ఐ హెల్త్‌కార్డులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా

రాయచోటి అర్బన్ : ఈఎస్ఐ హెల్త్‌కార్డుల వినియోగంతో కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తోందని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌తో కలసి పారిశుధ్య కార్మికులు, పబ్లిక్ హెల్త్ కార్మికులకు ఆయన ఈఎస్ఐ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ హెల్త్‌కార్డు కలిగిన ప్రతి కార్మికుడు కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే వీలుంటుందన్నారు. కుటుంబసభ్యులకు ఈఎస్ఐ వర్తిస్తుందని తెలిపారు. కార్మికులు హెల్త్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాధ, ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, మేస్త్రి సురేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు రాంబాబు, నేలపాటి శ్రీనివాసులుతోపాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పలువురు మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'ఇంటికి ఒక మొక్క ఊరికి వనం'

రామాపురం : వృక్షో రక్షిత రక్షితః అని ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క ఊరికి ఒక వనం అనే నినాదంతో అభయ హస్త ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చింతల వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ రహదారి ఆనుకొని కంభరాయునిగుట్ట సమీపంలో నాలుగు గ్రామాల పొలిమేరలో సోమరాయునిపేటలో వెలసిన అభయహస్త ఆంజనేయస్వామి దేవస్థానం రహదారికి ఇరువైపులా, ఆలయం చుట్టూ దాదాపు 400లకు పైగా కొబ్బరి చెట్లను నాటించారు. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపడతానని తెలియజేశారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, వెంకటరామిరెడ్డి, మైనార్టీ నాయకుడు రెడ్డి గఫూర్, డాక్టర్ కె.వి.ఎస్.నాయుడు, అమర్‌నాథరెడ్డి, సుగవాసి పార్థసారధి, ధర్మారెడ్డి, వారణాసి, రామోహన్‌రెడ్డి, యశోద, రాణి, రామకృష్ణ, గౌడ వెంకటరమణ, వెంకటేసు, నాగసుబ్బారెడ్డి, మూలస్థానేశ్వరస్వామి, శివాలయం చైర్మన్ చలమారెడ్డి, సుబ్బయ్య, మహేంద్ర, సురేంద్ర రాజు, మురళీకృష్ణ, వెంకట్రామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణ ప్లాన్ ఇక సులభతరం

రాయచోటి టౌన్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 300 చదరపు మీటర్లకు కన్నా తక్కువ ఉన్న ప్రదేశాలలో నిర్మించే ఇళ్ల నిర్మాణాల ప్లాన్ అనుమతి ఇక సులభతరమని ఎల్‌టీపీఎస్ అనుడ వైస్ చైర్మన్ వైఓ నందన్ తెలిపారు. మంగళవారం ఎంట్రో ల్యాబ్స్ వారు అభివృద్ధి చేసిన వెబ్ అప్లికేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణ ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో తీసుకరావడం వలన పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లక్ష్మి, పీఓ శైలజ, ఏపీఓ కృష్ణసింగ్, కడప మున్సిపల్ కార్పొరేషన్ డీసీపీ సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్

సిద్దవటం : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టామని ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ తెలిపారు. మండలంలోని భాకరాపేట పోలీస్ చెక్ పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో, ద్విచక్ర వాహనాలకు సంబంధించి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, కారు డ్రైవర్లకు సీట్ బెల్టు లేని వాహనాలను తనిఖీ చేశామన్నారు. 21 కేసులు నమోదు చేసి వారికి రూ.2,835 జరిమానా విధించినట్టు చెప్పారు. అంతేగాకుండా రహదారుల్లో ప్రయాణించేటప్పుడు వాహనదారులు జాగ్రతలను పాటించాలని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ దివ్య

చిన్నమండెం : మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ దివ్య పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం వడ్డించాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్ర నమోదును ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విజేతలకు చెక్కును అందజేస్తున్న సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె : నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ వారు రూ.25 వేలను అందజేశారు. బహుమతుల ప్రదానంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో టోర్నమెంట్ విజేత అనీల్ జట్టుకు రూ. 25 వేలు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి శ్రీనివాసులు జట్టుకు రూ. 15 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, గుంతకల్ రైల్వేబోర్డు సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కౌలూరు సుబ్రమణ్యం రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

సంబేపల్లె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి 15వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి 8,9 వ తేదీల్లో యస్.సోమవరం, 10,11 గున్నికుంట్ల, 12,13 గురిగింజకుంట, 14,15 గుట్టపల్లె గ్రామాల్లో గడప గడప కార్యక్రమానికి పాల్గొననున్నారు. అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలలో కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంపై వలంటీర్లు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణ

కలికిరి: కృషి విజ్ఞాన కేంద్రంలో డా.వైఎస్సార్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు, వాటి అవశ్యకత గురించి కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జ్యోతి విద్యార్థులకు వివరించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి

ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

పుల్లంపేట : ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. వేసవి కాలం వస్తుండటంతో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయాలు ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నరసింహ కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశం, మండల ఉపాధ్యక్షుడు జయశంకర్, మండల ఉపాధ్యక్షురాలు బోగా వెంకటసుబ్బమ్మ, ఎంఈఓ రంగనాథయ్య, డాక్టర్ సానేశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే మన ధ్యేయం



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్ బాబు

గాలివీడు : క్షయవ్యాధి నిర్మూలనకు అధికారులతో పాటు ప్రజలు కృషి చేయాలని లక్కిరెడ్డిపల్లె టీబీ యూనిట్ అధికారి డాక్టర్ వినయ్ బాబు పిలుపునిచ్చారు. గాలివీడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల కుపైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారందరికీ తప్పనిసరిగా గళ్ళ పరీక్ష చేయించాలని సూచించారు. పరీక్షలో క్షయ వ్యాధి సోకినట్లు తేలితే తగిన విధంగా మందులు అందించి చికిత్స ప్రారంభించాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, ఎవరైనా దాతల ద్వారా ఉచితంగా పౌష్టిక ఆహారం ఇప్పించడానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించినట్లైతే సమాజం నుండి క్షయవ్యాధిని పారదోలవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ రాధా మాధవి, డాక్టర్ మహ్మద్ రఫీక్, పీహెచ్ఎన్ షమీమ్ తార, ఆరోగ్య పర్యవేక్షకులు కె మహేశ్వర రెడ్డి, రామతులసీ, టీబీ పర్యవేక్షకులు హరి, ఎస్‌టీఎల్ఎస్ గంగన్న, ఏఎన్ఎంలు కళ్యాణి, లలిత, జ్యోతి, శైలజ, అయ్యవారమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు కవిత, మౌనిక, నయాజ్, యాసీన్, కృష్ణవేణి, షాహీన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి

రామాపురం : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను పూర్తిగా తగ్గించేసిందని, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించకుండా రైతులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఢిల్లీ ధర్నాల నేపథ్యంలో రైతు సంఘాల ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక హామీలను పట్టించుకోలేదన్నారు. రూ.25వేల కోట్లు అవసరమైన పోలవరం ప్రాజెక్టుకు కేవలం రూ.478 కోట్లు మాత్రమే కేటాయించి ఏ విధమైన అనుమతులు లేని కర్నాటకలోని ఎగువ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించడాన్ని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 30శాతం కోత విధించడంతో పని దినాలు కోల్పోయి వ్యవసాయ కార్మికులు పేదిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత నిధులు తగ్గాయన్నారు. మోడీ మోసపూరిత విధానాలను 9న జిల్లా అంతటా ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

వినియోగదారులకు అన్ని రకాల రుణాలు



మాట్లాడుతున్న నోడల్ అధికారిణి కవిత

సిద్దవటం : డీసీసీ బ్యాంకులో వినియోగ దారులకు అన్నీ రకాల ఋణాలు మంజూరు చేస్తున్నట్లు నోడల్ అధికారిణి కవిత తెలిపారు. మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంకులో మంగళవారం వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో డీసీసీ బ్యాంకులో డిపాజిట్లు, రైతు రుణాలు మాత్రమే మంజూరు చేసేవారమన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ. 1.50 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. అలానే చిరు వ్యాపారులకు రూ.10వేల నుంచి రూ.3 లక్షల వరకు, వాహన రుణాలు, గృహ రుణాలు, ఎడ్యుకేషన్ రుణాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తి గత రుణాలు ఇస్తున్నామన్నారు. బ్యాంకు మేనేజర్ సుచిత్ర మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లకు డిపాజిట్లపై గరిష్ఠంగా 7.80 శాతం అత్యధిక వడ్డీ, బంగారు నగలపై 9.2 శాతం తక్కువ వడ్డీతో త్వరితగతిన రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు.

జాస్ నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులతో జాస్ జాతీయ అధ్యక్షుడు ఎస్.ఆర్.చంద్ర

రాయచోటి అర్బన్ : దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారమే జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం (జాస్) ధ్యేయమని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు ఎస్.ఆర్.చంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తపేటలోని జాస్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా ఉండేందుకే జాస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగపరంగా వారికి అందాల్సిన వాటిపై పోరాడతామన్నారు.

జాస్ జిల్లా కార్యవర్గం

సమావేశంలో జాతీయ అంబేడ్కర్ సేవా సంఘం (జెఎఎస్ఎస్) అన్నమయ్య జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాస్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.రవిశంకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా గుండ్లూరు రాజేశ్వరి, జిల్లాసేవాదళ్ అధ్యక్షుడిగా మంచూరి రామక్రిష్ణ, యువ జన విభాగం అధ్యక్షుడిగా సుండుపల్లె గంగులప్ప, జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా రాయచోటి రవిశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో జాస్ కార్యవర్గాన్ని మండల, గ్రామస్థాయిలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులను జాగ్రత్తగా చూసుకోవాలి

కురబలకోట: కాబోయే తల్లుల (గర్భిణుల) ఆరోగ్య స్థితి గతులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటి డీఎం అండ్‌హెచ్ఓ లక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృత్వం జీవితంలో మరుపురాని తీపి గుర్తు అన్నారు. కడుపులో బిడ్డ కదులుతుంటే కాబోయే అమ్మ ఆనందానికి హద్దులుండవన్నారు. గర్భం దాల్చినప్పటి నుండి కాన్పు అయ్యే వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇబ్బందులు పడుతున్న గర్భవతుల పట్ల మరింత జాగ్రత్త వహించాలన్నారు. అవసరమైన వారిని ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ రంగనాథయ్య

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి కాంప్లెక్స్‌లోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జి.బాల నరసింహులు పదోన్నతి పొంది ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా ఓబులవారిపల్లె హైస్కూల్‌కు వెళ్లారు. అలాగే అనంతంపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఏ.చంద్రశేఖర్ పదోన్నతి పొంది పుల్లంపేట మెయిన్ పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్లారు. అలాగే ఆర్ రాచపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఒ.ఖాదర్ హుస్సేన్ పదోన్నతి పొంది టి.కమ్మపల్లి హైస్కూల్ ఇంగ్లిష్ మీడియం అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లారు. ఈ ముగ్గురు ఉపాధ్యాయులను ఎంఈఓ కె.రంగనాథయ్య, కాంప్లెక్స్ చైర్మన్ జయలక్షుమ్మ, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సీఆర్‌పీ ఆనంద్‌లు ఘనంగా సన్మానించారు.

మదనపల్లె రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : మదనపల్లెలోని కురవ వంక ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకొనేందుకు ప్రయత్నించగా మదనపల్లె రెవెన్యూ అధికారులు అడ్డుపడుతున్నారని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఫిర్యాదు అందజేశారు. ఇప్పటికే ఆ స్థలంలో పొజిషియన్ సర్టిఫికెట్, పట్టా, ప్రభుత్వ జీఓ కాపీలు, హౌసింగ్ బిల్లులు పలు మార్లు అందజేశామన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: ఎనిమిది మంది జూదరులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. మండలంలోని వెలిగల్లు పంచాయతీ కాయలపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఎనిమిదిమంది జూదరులు పట్టుబడగా, వీరి నుండి రూ.8200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ములకలచెరువు: ఏఎన్ఎంలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వ డాక్టర్ జాహ్నవిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలతో డాక్టర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎంకు రెండు కళ్లు



చేతి వృత్తుల వారితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

చిట్వేలి : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్ళు లాంటివని రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సీఎం రాచపల్లి సచివాలయం పరిధిలోని ఎం.రాచపల్లి, కొండయ్యగారిపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, అలివేలు మంగాపురం గ్రామాలలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ, సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కార నిమిత్తం అధికారులకు ఆదేశాలిస్తూ సంక్షేమ కార్యక్రమాలు అమలుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పడుతున్న తపనను యువతకు వివరిస్తూ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర, జిల్లా వ్యవసాయ సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదు



సంబేపల్లె: అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు చేస్తున్న దృశ్యం



లక్కిరెడ్డిపల్లె: బాలయోగి గురుకుల పాఠశాలలో సమావేశంలో పాల్గొన్న విద్యార్థినులు

- అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు లేకపోవడంపై మెమో జారీ
- రేషన్ షాపులు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లేకపోతే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర–1, బాలుర–2, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, చింతకుంటపల్లి, గొల్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లు, చౌటపల్లి గ్రామంలోని గొల్లపల్లి చౌక దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీల్లో విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన పోషణతో కల్గిన ఆహారాన్ని అందిస్తుందని, దీన్ని పిల్లలకు సక్రమంగా నాణ్యతతో కలిగిన వంటలు చేసి పెట్టాలని ఆయన సూచించారు. గొల్లపల్లిలోని చౌక దుకాణంలోని రికార్డులను తనిఖీ చేసి చిన్నచిన్న వ్యత్యాసాలు ఉండటంతో సరిచేసుకోవాలని సూచించారు. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై రోజువారి మెనూ నాణ్యతతో కూడిన భోజనాన్ని పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీఎస్ఓ రఘురాం, ఎస్సీ హైపర్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, ఎంఈఓ చక్రేనాయక్, ఆర్ఐ సమ్మత్ ఖాన్, సీడీపీఓ పద్మావతి, హెచ్‌డబ్ల్యూఓలు శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆహార కమిషనర్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని దుద్యాల గ్రామం బయనేని దళితవాడ అంగన్వాడీ, పెద్దజంగంపల్లె, పూజారివాండ్లపల్లె ప్రభుత్వ పాఠశాల, దేవపట్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులలో తనిఖీలు నిర్వహించి, రికార్డులును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు అందుతున్న భోజన పదార్థాలను పరిశీలించారు. తహసీల్దార్ మహేశ్వరీ బాయ్, ఐసీడీఎస్ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

రైతులకు లాభసాటి పట్టు పురుగుల సాగు



పట్టు పురుగులను పరిశీలిస్తున్న పట్టు పరిశ్రమ జిల్లా అధికారి శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : మండలంలోని మొదీన్‌సాబ్‌పల్లె గ్రామంలో హరి అనే రైతు సాగుచేసిన మల్బరీ పట్టు పరిశ్రమకు సంబంధించిన పట్టు పురుగుల షెడ్‌ను మంగళవారం జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో 250 ఎకరాల్లో పట్టు పురుగుల పరిశ్రమకు చెందిన మల్బరీ పంటను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారన్నారు. పట్టుపరిశ్రమ వల్ల రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందన్నారు. మొదటి పంట సాగు చేసినప్పుడు రైతుకు కొంత డబ్బులు ఖర్చు, అవుతాయని, రెండవ పంట వేసేటప్పుడు ఎంతో మేలు జరుగుతుందన్నారు. హరి అనే రైతు పట్టు పరిశ్రమ పురుగుల గూడు 24 గంటల్లో పట్టు దారంగా తయారు అవుతుందని, పట్టు పరిశ్రమ, మల్బరీ వల్ల రైతు బాగుపడుతున్నాడని, ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ సిబ్బంది, రైతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



జడ్జి శ్రీనివాస్ కల్యాణ్

సిద్దవటం : ఈనెల 11వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిద్దవటం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసకళ్యాణ్ పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను కక్షిదారులు సౌకర్యార్థం లోక్ ఆదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీ పడి తమ విలువైన సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో పోలీసు సిబ్బంది ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.